క్లుప్తంగా

యోగాతో మానసికోల్లాసం



వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రారంభమైన యోగా తరగతులు

రాయదుర్గం: యోగాతోనే మానసికోల్లాసం సాధ్యమని యోగా గురూజీ రిషీ ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో యోగా తరగతులు సోమవారం సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభమవుతున్నట్లు గురూజీ తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్ గౌని లావన్య, పార్టీ నాయకులు పొరాళ్ల శివ, గౌని శ్రీరామిరెడ్డి ఆదివారం యోగా తరగతుల్లో పాల్గొని గురూజీ ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములై సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. పిలుపునిచ్చారు.

29 నుంచి దివ్యాంగులకు ఆటల పోటీలు

కళ్యాణదుర్గం రూరల్: ఈ నెల 29 నుంచి దివ్యాంగులకు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ తెలియజేశారు. ఆదివారం పట్టణంలోని బీసీ హాస్టల్‌లో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి అక్టోబర్ 29 వరకు దివ్యాంగులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తిగల దివ్యాంగులు పాల్గొనాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 7997199043, 9985487981లో సంప్రదించాలన్నారు.

కురుబ సంఘం మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కురుబ సంఘం మండల కమిటీ సభ్యులు

కంబదూరు: కురుబ సంఘం మండల కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల గౌరవాధ్యక్షుడిగా శివారెడ్డి, మండల అధ్యక్షుడిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బొమ్మయ్య, మాధవయ్య, చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా బోర్ల మల్లేష్, కార్యదర్శులుగా డిష్ మాధవయ్య, రవి, కోశాధికారిగా బసవరాజు, ప్రచార కార్యదర్శిగా ముత్యాలప్ప, కమిటీ సభ్యులుగా వెంకటేశులు, మారుతి, నగేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాలూక అధ్యక్షుడు కామక్కపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం సమీపంలోని వేదావతి హగరి నుంచి అనధికారికంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఈశ్వరయ్య ఆదివారం తెలిపారు. ట్రాక్టర్ యజమాని హుసేన్‌పీరాపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు.

మలయనూరులో పరిసరాల పరిశుభ్రత

కుందుర్పి: మండలంలోని మలయనూరులోని గ్రామ సచివాలయం, ఎస్సీకాలనీ ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, సర్పంచు ఓబన్న ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రంగా మారడంతో పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రతను తొలగించి, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



చిన్నహోతూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. ఆదివారం చిన్నహోతూరు, గడేహోతూరు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేశారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి మాట్లాడుతూ డెంగీ జ్వరంపై అపోహలు వీడాలని, డెంగీ జ్వరం ప్రాణాంతకమైన వ్యాధికాదన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చంద్రా, ఏఎన్‌ఎం అరుణ,ఆశా కార్యకర్త నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గం నియోజకవర్గం

మహిళా ఓటర్లు: 1,02,905

పురుష ఓటర్లు: 1,02,235

మొత్తం ఓటర్లు: 2,05,140

మండలాలు : కళ్యాణదుర్గం, కుందుర్పి, కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం

సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై కూటమికి ఓట్లేసిన వారు : 1,18,878

అమిలినేని...అంతా ఆర్భాటమే

ఎన్నికల సమయంలో అధికారం కోసం ఉత్తుత్తి హామీలు

- పాలన వందరోజులు పూర్తి చేసుకున్నా అమలు ఊసేలేదు
- నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే
- అడుగు ముందుకు పడని బీటీపీ పనులు

సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు కూటమి నేతలు సూపర్ సిక్స్ పేరుతో అలవిగాని హామీలిచ్చారు. 'బాబు గ్యారెంటీ.. భవిష్యత్‌కు ష్యూరిటీ' అని ప్రజలకు ఆశ పెట్టి ఆర్భాటంగా ప్రచారం చేశారు. అధికారంలోకొచ్చి వందరోజులైంది. ఇచ్చిన హామీల్లో నియోజకవర్గ ప్రజలకు ఏ ఒక్కటీ అమలుచేయలేదు. ఉత్తుత్తి మాటల తో పాలన సాగిస్తున్నారు. అమలు చేయలేని హామీలిచ్చి గెలిచిన అమిలినేని ..నియోజకవర్గ అభివృద్ధి పైనా, ప్రజల సంక్షేమంపైనా దృష్టి పెట్టలేదు. కేవలం 'గెలిచాం..అధికారం అనుభవిస్తున్నాం' అన్నట్లు నియోజకవర్గ ప్రజాప్రతినిధి వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

– కళ్యాణదుర్గం:



ఒంటిమిద్ది వద్ద అర్ధంతరంగా ఆగిన బీటీపీ కాలువ పనులు

బీటీపీ పనులు పట్టని ఎమ్మెల్యే..


కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ఆయువుపట్టు భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీ ప్రాజెక్టు వరకు కాలువలు పూర్తి చేస్తే నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉంటుంది. అయితే ఎన్నికల ముందు బీటీపీ ప్రాజెక్టును పూర్తి చేసి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు కాలువలు తవ్వి సాగు నీరిస్తామని గొప్పలు చెప్పిన కూటమి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.. ఆ ప్రాజెక్టు పూర్తి చేయాలని చంద్రబాబును కోరుతున్నారే తప్పా ఒక్క అడుగు ముందుకు సాగలేదని ప్రజలు అంటున్నారు. నియోజకవర్గంలో ఏటా వర్షాధారం కింద 62,038 హెక్టార్లు, బోరు బావుల కింద 16,702 హెక్టార్లలో సాగవుతోంది.



ఎన్నికల రోడ్‌షోలో హామీలిస్తున్న కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు (ఫైల్)

బాగుపడని రోడ్లు..

ఎన్నికల ముందు మాత్రం తనను గెలిపిస్తే నియోజకవర్గంలో రోడ్లను బాగుచేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే.. ఆతర్వాత రోడ్ల గురించి పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లోకేష్ ఆశీస్సులతో అన్ని పనులూ చక్కబెడతానని చెప్పి.. ఎన్నికల్లో గెలిచిన అనంతరం మాట తప్పాడంటూ ప్రజలు అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు భారీగా ధ్వంసమయ్యాయి. చాలా గ్రామాలకు రోడ్లు మరమ్మతులు చేయించాల్సి ఉంది. నుసికొట్టాల తండాను సందర్శించిన అనంతపురం జిల్లా జడ్జి సైతం రోడ్ల దుస్థితిని చూసి పది రోజుల్లో బాగుచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు చీవాట్లు పెట్టడం గమనార్హం.



కళ్యాణదుర్గం పట్టణం ఏరియల్ వ్యూ

పరిశ్రమల ఏర్పాటుకు చేసిందేమీలేదు..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి స్థానిక మహిళలకు నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు ప్రచారంలో అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల అనంతరం పరిశ్రమల స్థాపన ఊసే లేదు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం వద్ద మల్టీ పార్కు ఏర్పాటు కోసం 1,023.63 ఎకరాలు కేటాయించింది. అయితే ఇప్పటికీ ఎలాంటి పార్కు ఏర్పాటు చేయలేదు. పరిశ్రమలు ఏర్పాటుకు ఎమ్మెల్యే అమిలినేని కృషి చేయాలని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 48,340 మంది నిరుద్యోగులు కోరుతున్నారు.

ప్రజల ముందుకు ఎలా వెళ్తారు?



ప్రజలు అవకాశం ఇచ్చారు. పాలన కట్టబెట్టారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు చేయండి. అధికారంలోకొచ్చి వందరోజులైంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఎన్నికల్లో మీకు వచ్చిన మెజార్టీపై మీకే నమ్మశక్యంగా లేదు. మీరు ఊహించినంతగా మెజార్టీని ప్రజలు ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రజలకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. బీటీపీ కాలువ భూసేకరణ దాదాపుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే పూర్తి చేసింది. కక్ష సాధింపులు మాని కళ్యాణదుర్గం అభివృద్ధికి పాటుపడండి. ప్రజలకు వంద రోజుల్లో ఏమీ చేయకుండానే మంచి చేశామంటూ ప్రజల ముందుకెళ్లి ఏం చెబుతారు?.. అధికారం మీది..కాంట్రాక్టరు కూడా మీరే కదా? రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయండి.

– తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కళ్యాణదుర్గం

కక్ష సాధింపులకే సరిపోతోంది..



కేవలం కూటమి ప్రభుత్వం విమర్శలు, కక్ష సాధింపులకే సమయం కేటాయిస్తోంది. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి.. పరిశ్రమలు అని చెప్పినా ఏ ఒక్కటీ అమలు చేసిన పరిస్థితిలేదు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు లేక కూలి పనులకు వెళ్తున్నారు. పరిశ్రమలు స్థాపిస్తే స్థానికంగా నిరుద్యోగులకు ఉపాధితో పాటు ఉద్యోగాలు లభిస్తాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయాలి.

– నగేష్, విద్యార్థి సంఘం నేత, కంబదూరు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ఎన్నికలు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి. వంద రోజులైనా ఏ ఒక్క హామీ పథకం కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు. రైతులకు రైతు భరోసా ఇవ్వలేదు. ఏడాదికి మూడు సిలిండర్లు అన్నారు. పిల్లలకు డబ్బులు ఇవ్వలేదు. వంద రోజులైనా ఇప్పటికీ ఒక్క పథకం ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో?

– నాగరాజు, ఒంటిమిద్ది

ప్రజా పాలనపై దృష్టి పెట్టాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి వంద రోజులు పూర్తయ్యింది. ఇప్పటికీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. నియోజకవర్గంలో రైతులను, నిరుద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో గద్దెనెక్కి అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలను విస్మరించడం సరైంది కాదు. పాలకులు ప్రజా పాలనపై దృష్టి పెట్టాలి.

– ఎంఎస్ హనుమంతరాయుడు, శెట్టూరు



ఎన్నికల సమయంలో కూటమి నేత అమిలినేని విడుదల చేసిన సూపర్‌సిక్స్ పథకాల పోస్టర్

వైద్యుడిపై దాడి తీవ్రంగా కలచివేసింది

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య



కళ్యాణదుర్గం: కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల (ఆర్‌ఎంసీ) హెచ్‌ఓడీ, దళిత సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఉమా మహేశ్వరరావుపై దాడి తనను కలిచివేసిందని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. డాక్టర్ ఉమా మహేశ్వరరావుపై కొందరు వైద్య విద్యార్థులు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అనుచరులు అసభ్యంగా ప్రవర్తించి, భౌతిక దాడికి దిగడం క్షమించరానిదన్నారు. బయట వ్యక్తులు కళాశాల ఆవరణలోకి చొరబడి దాడికి పాల్పడటం రంగరాయ మెడికల్ కళాశాల చరిత్రలో ఇదే మొదటి సారి అని అన్నారు. దళిత డాక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే దాడికి ప్రోత్సహించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచు మోనాలిసా పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రం వజ్రకరూరులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కిరాణాషాపు వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని మురుగు కాలువల్లో చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. గ్రామసచివాలయంలో పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు చేయించారు. సర్పంచు మోనాలిసా, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి వారి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో వచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కార్డన్ సెర్చ్



డీ హీరేహాళ్ మండలం కల్యంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాయదుర్గం: డీ హీరేహాళ్ మండలంలోని కల్యం, రాయదుర్గం మండలంలోని మెచ్చిరి సమస్యాత్మక గ్రామాల్లో ఆదివారం రూరల్, అర్బన్ సీఐలు వెంకటరమణ, జయానాయక్ ఆధ్వర్యంలో పోలీస్ కార్డన్ సెర్చ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో కవాతు నిర్వహించారు. పాతనేరస్తులు, మద్యం కేసుల్లో పట్టుబడిన వారు, అనుమానితుల ఇళ్లు, పరిసరాల్లో సోదాలు చేశారు. వాహనాలన్నీ ఓ చోటకు చేర్చి వాటి రికార్డులు పరిశీలించారు. ఇటీవల ఈ రెండు గ్రామాల్లోనూ రెండు వర్గాల మధ్య గొడవలు జరిగి, కొందరు జైలు పాలయ్యారు. మెచ్చిరిలో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా సీఐలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఆ తర్వాత అందరు కలసి మెలసి ఉండాలన్నారు. సమస్య ఏదైనా సరే సొంత నిర్ణయానికి వెళ్లకుండా పోలీసులను ఆశ్రయించి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం కర్ణాటక మద్యం పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమాల్లో అర్బన్ సహా ఐదు మండలాల ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం



గ్రామంలో సేకరించిన ప్లాస్టిక్ సంచులు

రాయదుర్గం: మండలంలోని కొంతానపల్లిని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదామని కేటీఎస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు (ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం కోఆర్డినేటర్లు)డీ నారాయణ, జి. కోదండ అన్నారు. ఆదివారం కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను సేకరించారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లెక్చరర్లు మాట్లాడారు.. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కొంతనపల్లిని దత్తత తీసుకున్నామన్నారు. పల్లెల్లో అవగాహన లోపంతో ప్లాస్టిక్ భూతం పట్టిపీడిస్తోందన్నారు. దీంతో అనేక విధాలుగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్లాస్టిక్ ఎక్కడబడితే అక్కడ పడేయకుండా కాల్చిబూడిద చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గంలో మోస్తరు వర్షం



పట్టణంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. సాయత్రం 5.30 గంటలకు ప్రారంభమైన వర్షం గంటపాటు కురిసింది. దీంతో కొద్దిసేపు రోడ్లపై వర్షపునీరు పారింది. వారంరోజుల నుంచి ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి వర్షం కురవడంతో కాస్త ఉపశమనం లభించింది.

నేటిలోపు ఈ కేవైసీ చేయించుకోవాలి

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు సోమవారం లోపు పంట నమోదు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ మధుకర్ తెలిపారు. ఆదివారం మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలో 13,687 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 11,773 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నట్లు వెల్లడించారు. మిగిలిన 1,914 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని ఏఓ తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కుందుర్పి: మండలంలోని వడ్డేపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి ఆలయంలో తెల్లవారు జామున పంచమి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి స్వామివారి గ్రామోత్సవం కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమం, ఆదివారం తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకం, పంచమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలం నుంచేగాక కర్ణాటక నుంచి భక్తులు హాజరయ్యారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు




వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో వెలసిన నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు ఆకుపూజ, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు చేశబూరు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం

కళ్యాదుర్గం రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో పట్టణంలోని లిటిల్ రోజస్ పాఠశాలలో ఆదివారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి 40 మందికిపైగా కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ రమేష్ బాబు, కార్యదర్శి కంబాల తిమ్మారెడ్డి, కార్యదర్శి ఉమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడికి అభినందనలు



అనంతకు అభినందనలు తెలియజేస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి

డీ హీరేహాళ్ (రాయదుర్గం): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని డీ హీరేహాళ్ మండలం గొడిశెలపల్లికి చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడంపై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితుల పై చర్చించారు. కూటమి ప్రభుత్వంపై వంద రోజుల్లోనే వ్యతిరేకత వచ్చిందని, ప్రజల పక్షాన నిలబడి పోరాటం సాగిద్దామన్నారు.